క్లుప్తంగా

నేడు 'డయల్ యువర్ ఈఓ'

అన్నవరం: వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సోమవారం డయల్ యువర్ ఈఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి నెలా చివరి సోమవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. భక్తులు ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకూ 08868–238127 నంబర్‌కు ఫోన్ చేసి దేవస్థానంలో తాము ఎదుర్కొన్న ఇబ్బందులపై ఈఓకు ఫిర్యాదు చేయవచ్చు. దేవస్థానం అభివృద్ధికి సూచనలు, సలహాలు ఇవ్వవచ్చునని తెలిపారు.

సావర్కర్ జయంతి



యర్రవరంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

ఏలేశ్వరం: స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక్ దామోదర వీరసావర్కర్ జయంతిని యర్రవరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లాశ్రీనివాస్, మండల అధ్యక్షుడు ఏనుగు ధర్మరాజు ఆధ్వర్యంలో సావర్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించడం జననం లాంటిదని సావర్కర్ నిరూపించారన్నారు. ప్రధాని నరేంద్రమోదీ అధికారం చేపట్టి తొమ్మిదేళ్లు పూర్తికావడంతో ప్రజల్లో కేంద్ర పథకాలపై ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కురాకుల రాజా, బండారు సూరిబాబు, చిన్నికృష్ణ, ఈగల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన



ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: మెప్మా ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం రుతుస్రావ పరిశుభ్రత దినోత్సవం నిర్వహించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించి ర్యాలీ చేశారు. సదస్సులో వ్యక్తిగత పరిశుభ్రత, రుతుస్రావ సమయంలో ఉన్న అపోహలపై అవగాహన కల్పించారు. జనాభాలో 48 శాతం మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చైతన్యపరిచారు. చైర్‌పర్సన అలమండ సత్యవతి, సాయికుమార్, ఆర్పీలు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ శత జయంతి

ఏలేశ్వరం: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు శతజయంతి వేడుకలు జె.అన్నవరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు సూతిబూరయ్య, మూది నారాయణస్వామి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీనాయకులు పాల్గొన్నారు. ఏలేశ్వరంలో టీడీపీ నాయకుడు పైల సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్‌రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు. ఎన్టీఆర్ హయాంలో పేదప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో పార్టీనాయకులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ లారీల నిలిపివేత



హెచ్‌పీ గ్యాస్ ప్లాంట్ వద్ద రహదారి చెంత నిలిపి ఉంచిన లారీలు

గోకవరం: వీరలంకపల్లి గ్రామ శివారున హెచ్‌పీ గ్యాస్ ప్లాంట్ సమీపంలో జాతీయ రహదారి వద్ద గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే లారీలను నిలిపివేయడంతో దారి ఇరుకుగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి ప్లాంట్‌కు నిత్యం వందల సంఖ్యలో లారీలు గ్యాస్‌ను వివిధ ప్రాంతాలకు రవాణా చేయడానికి వస్తుంటాయి. ఆ లారీలకు కేటాయించిన స్థలంలో కాకుండా డ్రైవర్లకు జాతీయ రహదారి పక్కన నిలిపివేస్తున్నారు. ఇది ప్రమాదకరమే కాకుండా రహదారి ఇరుకుగా మారుతోందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించి హెచ్‌పీ గ్యాస్ ప్లాంట్ వద్ద రహదారి చెంత లారీలు నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

కొత్తపల్లి: ఉప్పాడ శివారు సుబ్బంపేటకు చెందిన ఎరిపల్లి కొండయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం అతని కుటుంబానికి ప్రభుత్వం అందించిన వైఎస్సార్ బీమా మొదటి విడత రూ.10వేలను మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ బుజ్జిబాబు, సూరాడ నాగేశ్వరావు, మేరుగు బుజ్జమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి నూతన భవనం

- ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గండేపల్లి పీహెచ్‌సీ భవనం
- రూ.1.58 కోట్లతో నిర్మాణ పనులు
- ఎమ్మెల్యే చంటిబాబు చొరవతో సమస్య పరిష్కారం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పీహెచ్‌సీ నూతన భవనం



పీహెచ్‌సీ నూతన భవనంలో డెలివరీ గది



పెచ్చులూడుతున్న పీహెచ్‌సీ పాత భవనం

గండేపల్లి: ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. నాడు– నేడు పథకంలో అభివృద్ధి పనులు చేస్తోంది. గండేపల్లిలో సుమారు 13 ఏళ్ల నాటి సమస్యకు నాడు–నేడుతో పరిష్కారం లభించింది. స్థానిక వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు చొరవతో గండేపల్లి ప్రజా ఆరోగ్య కేంద్రానికి నూతన భవనం సమకూరింది. ప్రభుత్వం రూ.1.58 కోట్ల నిధులు మంజూరు చేయడంతో నూతన భవన నిర్మాణ పనులు పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది.

వంద మంది ఓపీ

మండల కేంద్రమైన గండేపల్లి పీహెచ్‌సీ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) శిథిలావస్థకు చేరుకోవడంతో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నూతన భవనాన్ని నిర్మించేందుకు చేసిన ప్రయత్నం ఫలించింది. ఈ పీహెచ్‌సీకి గండేపల్లితో పాటు రామయ్యపాలెం, సింగరంపాలెం, మురారి, ఎన్టీ రాజాపురం, కె.గోపాలపురం, మల్లేపల్లి, తాళ్లూరు, నీలాద్రిరావుపేట, జెడ్.రాగంపేట, ఉప్పలపాడు, సుబ్బయమ్మపేట గ్రామాల ప్రజలు వైద్య సేవలకు వస్తుంటారు. ఈ గ్రామాల నుంచి ప్రతి రోజు సుమారు 100 మంది ఓపీ ఉంటుంది. భవనం కూలేందుకు సిద్ధంగా ఉండడంతో ఆసుపత్రికి వచ్చేందుకు రోగులు భయపడేవారు. గోడల బీటలు వారీ, శ్లాబ్ పెచ్చులూడుతుండడంతో వైద్య సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించేవారు. వర్షా కాలంలో పూర్తి గదుల్లోకి నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడేవారు.

ఎమ్మెల్యే కృషి ఫలితం

ఈ పీహెచ్‌సీని 1994లో నిర్మించారు. అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి స్వర్గీయ కె.రోశయ్య, ఎమ్మెల్యే తోట వెంకటాచలం, ఎంపీ తోట సుబ్బారావు చేతుల మీదుగా ప్రారంభం జరగ్గా 2010లో అప్పటి ఎమ్మెల్యే తోట నరసింహం ఆధ్వర్యంలో ఆసుపత్రిని అభివృద్ధి చేశారు. కాల క్రమేణ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నూతన భవనం ఏర్పాటైందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పీహెచ్‌సీ సిబ్బంది, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకోని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఇచ్చిన మాట ప్రకారం నూతనం భవనం ఏర్పాటు చేశారు. దీనిపై మండల ప్రజలు, ఆరోగ్య సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హాస్పటల్‌కి వైద్యం నిమిత్తం వచ్చే రోగుల సౌకర్యార్థం వేర్వేరు గదులు, ఎటాచ్డ్ బాత్‌రూమ్స్, తదితర వసతులతో నూతనం భవనం అదుబాటులోకి రానున్నట్టు తెలియజేశారు.

భయపడేవాళ్లం



ఆరోగ్యం మాట ఎలా ఉన్నప్పటికి ఆసుపత్రికి రావాలంటే భయపడేవాళ్లం. ఇటు వైద్య సిబ్బంది, అటు రోగులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. వర్షాకాలంలో హాస్పటల్ గదుల్లోకి నీరు చేరేది. ప్రస్తుత భవనం బీటలు వారి మొక్కలు మొలిచి వేర్లు పెరిగాయి. నూతన భవనం నిర్మాణంతో సమస్య తీరుతుంది.

–మద్దిపట్ల రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు, గండేపల్లి

ఎన్నో ఏళ్ల సమస్య తీరింది



ఎన్నో ఏళ్ల నాటి సమస్య పరిష్కారమైంది. పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఎంతో ప్రయత్నం చేశారు. 12 గ్రామాల ప్రజల ఆందోళనకు చెక్ పడింది. ఈ ప్రభుత్వం నాడు–నేడుతో రాష్ట్ర ప్రజలకు కావాల్సిన వసతులను అందజేస్తుంది.

–చలగళ్ల దొరబాబు, ఎంపీపీ, గండేపల్లి

రత్నగిరిపై సూర్యనమస్కారాలు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిన రామారాయ కళావేదికపై ఆదివారం సూర్యనమస్కారాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండితుల మంత్రోచ్చాటన మధ్య వివిధ భంగిమలతో సూర్యనమస్కారాలు చేశారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలు నివేదించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ పూజల్లో పండితుల ఆకొండి కృష్ణశర్మ, రాందాసు, నాగాభట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధారపల్లికి పర్యాటకుల తాకిడి



ఉల్లాసంగా గడుపుతున్న యాత్రికులు

ప్రత్తిపాడు రూరల్: ధారపల్లి జలపాతం వద్ద ఆదివారం యాత్రికులతో సందడి వాతావరణం నెలకొంది. వేసవి సెలవులు, ఆదివారం కావడంతో ధారపల్లి జలపాతానికి భారీగా యాత్రికులు తరలివచ్చి సందడి చేశారు. కుటుంబ సభ్యులతో సహా జలపాతం వద్దకు స్నానాలు చేసి ఆ ప్రాంగాణంలో సాయంత్రం వరకూ ఆనందంగా గడిపి వేసవి తాపం నుంచి ఉపశమనం పొందారు. యువత ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు.

జుడో మినీ ఒలిపింక్స్ పోటీలు



జుడో మినీ ఒలింపిక్స్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం కాకినాడ జిల్లా జుడో మినీ ఒలింపిక్స్ పోటీలు జుడో జిల్లా సెక్రటరీ టీవీ రమణ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న వారిలో అత్యంత ప్రతిభ కనబరిచిన 16 మంది గోల్డ్ మెడల్స్, 16 మంది సిల్వర్ మెడల్స్, 32 మంది బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకున్నట్టు రమణ తెలిపారు. కాకినాడ, పిఠాపురం, ఏలేశ్వరం, ప్రత్తిపాడు, గోకవరం, జగ్గంపేట పరిసర ప్రాంతాలకు చెందిన గ్రామాల నుంచి 95 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. వీరికి ఈనెల 31వ తేదీన కాకినాడ డీఎస్సీ గ్రౌండ్స్‌లో జరిగే మినీ ఒలింపిక్స్ బహుమతి ప్రదానోత్సవంలో పతకాలను అందించారు. రెఫరీలుగా తేజ, లోవరాజు, బుజ్జి, సాయికృష్ణ, దేవికృష్ణ, రాజు, హర్ష పాల్గొన్నట్టు తెలిపారు.

ఉత్తమ విద్యార్థులకు బహుమతులు



ప్రత్తిపాడులో విద్యార్థినికి బహుమతిని అందిస్తున్న విలియమ్స్ ప్రసాద్

ప్రత్తిపాడు: పది, ఇంటర్ తరగతుల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు వారిని అభినందించి, బహుమతులు అందజేసినట్టు సెంటినరీ బాప్టిస్ట్ చర్చి సంఘ కార్యదర్శి రెవరెండ్ గుడాల సుందర్రావు తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 600కి 562 మార్కులు సాధించిన పీతల చందన్, ఇంటర్మీడియెట్‌లో 1000 కి 956 మార్కులు సాధించిన సుప్రియలను స్థానిక సెంటినరీ బాప్టిస్ చర్చిలో ఆదివారం సాయంత్రం సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. సంఘ కాపరి విలియమ్స్ ప్రసాద్ చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా జరిగిన అభినందన సభలో గుడాల సుందర్రావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యపై ఆసక్తి కలిగి ఉండాలని, ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని, దానిని సాధించేంత వరకూ నిరంతర కృషి చేయాలని అన్నారు. ఓపెన్ టెన్త్ పరీక్షలకు హాజరు కాగోరే నిరుపేద విద్యార్థులకు ఫీజులు చెల్లించేందుకు ఆర్థిక సహాయం అందిస్తానని గుడాల సుందర్రావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కె.సంజీవరావు, ఇంజినీర్ బి.మోహన్, చంద్రలీల, సుజాన ప్రకాష్, భాగ్యరత్నం, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఏలేశ్వరంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఏలేశ్వరం: ఆనాటి రోజులు గుర్తుతెచ్చుకుని పులకించిపోయారు. తాము చదువుకున్న రోజుల నాటి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. చదువుకుని ఏళ్లు గడచినా మరిచిపోకుండా తమ కుటుంబ సభ్యులతో కలుసుకున్నారు. 1992–93 సంవత్సరంలో లింగంపర్తిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు స్థానిక ఎస్‌కన్వెన్షన్ హాలులో ఆదివారం కలుసుకున్నారు. వారు రోజంతా ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. అనంతరం టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు.

మెట్టచింతలో గాయత్రీ మహా యజ్ఞం

ప్రత్తిపాడు రూరల్: మెట్టచింతలో విశ్వ గాయత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాయత్రీ యజ్ఞాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన కనకదుర్గ అమ్మవారి సన్నిధిలో గాయత్రి మహా యజ్ఞాన్ని వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

యువకుడి అదృశ్యం



నాగరాజు(ఫైల్)

గండేపల్లి: యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు గండేపల్లి ఎస్సై వై.గణేష్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మురారికి చెందిన ముప్పిడి నాగరాజు రాజానగరం జీఎస్ఎల్ హాస్పిటల్లో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. గత ఏడాది అక్టోబర్ 11న డ్యూటీకి వెళ్లి ఇంటికి రాకపోవడంతో అప్పటి నుంచి బంధువుల ఇళ్ల వద్ద, ఇతర చోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో నాగరాజు భార్య పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు తెలిపారు.

లోవకు పోటెత్తిన భక్తులు



లోవ దేవస్థానంలో కిక్కిరిసిన భక్తజనం

తుని రూరల్: లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తలుపులమ్మ అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు ప్రత్యేక వాహనాల్లో తరలి వచ్చారు. క్యూ లైన్ల ద్వారా 20 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. రవ్వ లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,45,470, పూజా టికెట్లకు రూ.1,35,210, తలనీలాలకు రూ.15,075, వాహన పూజలకు రూ.4,090, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెల రూపేణా రూ.73,700, విరాళాలుగా రూ.1,21,626 కలిపి మొత్తం రూ.4,91,171 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు. ప్రత్యేక క్యూలైన్లలో అరగంట, ఉచిత దర్శనాలకు గంటపాటు భక్తులు వేచి ఉండి అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం అధీనంలో ఉన్న వసతి గదులు లభించని భక్తులు ఆలయ ప్రాంగణంలో చెట్ల కింద, ఉచిత షెడ్ల కింద, ఘాట్ రోడ్డు దిగువన మామిడి, జీడిమామిడి తోటల్లో వసతి ఏర్పాటు చేసుకుని, వంటలు, భోజనాలు చేశారు. భక్తుల ఏర్పాట్లను చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ధర్మకర్తలు, శ్రీవారి సేవకులతో కలసి ఈఓ పర్యవేక్షించారు.

ఈదురుగాలులతో భారీ వర్షం



గోకవరంలో ఆదివారం సాయంత్రం మేఘావృతమైన ఆకాశం



ఏలేశ్వరంలో కురుస్తున్న వర్షం

ఏలేశ్వరం: ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పట్టణంలో ఆదివారం కురిసింది. ఈదురుగాలులు తీవ్రంగా ఉండడంతో ప్రజలు భయాందోళలను గురయ్యారు. ఎండలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో ఉపశమనం పొందారు. ఉదయం నుంచి ఎండలు మండిపోగా సాయంత్రం ఆకాశం మేఘావృతమై గాలులతో కూడిన వర్షం పడింది. సాయంత్రం వర్షం పడగా వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రోహిణీకార్తెలో ఎండలతో పాటు వర్షాలు పడుతుండడంతో కాలం ఎలా ఉంటుదోనని ప్రజలు అయోమయానికి గురువుతున్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో వర్షం కురిసింది. ఉదయం నుంచీ సూర్యప్రతాపంతో వాతావరణం వేడెక్కింది. ప్రజలు ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. సాయంత్రం ఆకాశం మేఘావృతమై, దట్టమైన మబ్బులు కమ్ముకున్నాయి. కొద్దిసేపు భారీ ఈదురుగాలులు వీచాయి. ఓ మోస్తరుగా వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీటితో పలు చోట్ల రోడ్లు నీటమునిగాయి. మామిడి, జీడి మామిడి తోటలకు గాలులు తీవ్ర నష్టాన్ని కలిగించాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

శంఖవరం: మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో ఒక్కసారిగా మేఘావృతమై వర్షం పడింది. వర్షానికి కొన్ని చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అచ్చంపేట, ఎస్.జగ్గంపేట, జి.కొత్తపల్లి, గవిరంపేట గ్రామాల్లో ఉన్న అరటి, మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు.

గోకవరం: మండలంలో ఆదివారం వాతావరణం ఉదయం వేడిగా, సాయంత్రం చల్లగా మారింది. రోహిణీ కార్తె కావడంతో ఉదయం 9 గంటల నుంచి భానుడు భగభగ మండుతూ ఎండలకు వాతావరణం వేడిగా ఉంది. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. అయితే సాయంత్రం 4 గంటల నుంచి వాతావరణం ఒక్కసారిగా మేఘావృతమై కారు మబ్బులు కమ్ముకోవడంతో పాటు ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీనివల్ల వాతావరణం చల్లబడడంతో ఉదయం నుంచి వేసవి తాపాన్ని ఎదుర్కొన్న ప్రజలు సేదతీరారు.



ప్రత్తిపాడు అంబేద్కర్ కళా మందిర్ వద్ద నీట మునిగిన ఇందిరా కాలనీ రోడ్డు



గజ్జనపూడిలో గాలి ఉధృతి



అచ్చంపేటలో కురుస్తున్న వర్షం

పిఠాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడి మృతి



గ్రంధి మంగరాజు

పిఠాపురం: స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ అధ్యక్షుడు గ్రంధి మంగరాజు(56) ఆదివారం మృతి చెందినట్టు ఆయన బంధువులు తెలిపారు. ఆయన గత 14 ఏళ్లుగా పిఠాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ అధ్యక్షుడిగా సేవలందించారు. ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకులుగా వెండి బంగారు డైమండ్స్ వర్తక సంఘం నాయకులుగా పని చేశారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో వైద్య సేవలు పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఆయన మృతిపై ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కాకినాడ ఎంపీ వంగా గీత, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తదితరులు తమ సంతాపాన్ని తెలియజేశారు.

నమ్ముకున్న వారికి స్పష్టత ఇవ్వండి

కాకినాడ: వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే స్థానాలపై జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. అన్ని స్థానాలకు పోటీ చేస్తారో, పొత్తులతో వెళతారో స్పష్టత లేకపోవడం వల్ల రాష్ట్రంలో జనసేనను నమ్ముకున్న ఎంతోమంది నేతలు రాజకీయాలపై ఆసక్తితో సొంత సొమ్మును ఖర్చు చేస్తున్నారని అన్నారు. చివరకు పవన్‌కళ్యాణ్ పొత్తులు పెట్టుకుని వాళ్లందరికీ మొండి చేయి చూపించే పరిస్థితి కనిపిస్తోందని, అదే జరిగితే వాళ్లంతా ఆర్థికంగా దివాలా తీసే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఆదివారం ఆయన తన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడుతూ పొత్తులతోనే ఎన్నికలకు వెళతానని ఇప్పటికే కొంతమేరకు స్పష్టతనిచ్చిన పవన్ పోటీ చేసే స్థానాలపై కూడా స్పష్టత ఇవ్వాలని అన్నారు. అలా చేయడం వల్ల ఎంతోమందికి ఊరటను ఇచ్చిన వారవుతారని చెప్పారు.

టీడీపీకి ఇదే చివరి మహానాడు

ప్రస్తుతం జరుగుతున్న మహానాడే టీడీపీకి చివరిదని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ మరణానికి కారణమైన చంద్రబాబే ఆయన పేరుతో విగ్రహాలు పెట్టి మహానాడును నిర్వహిస్తున్న తీరు చూస్తుంటే విడ్డూరంగా ఉందని అన్నారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. కార్యక్రమంలో కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ తదితరులు ఉన్నారు.

ఫార్మసిస్టులకు సన్మానం

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ ఫార్మసిస్టు అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్వసభ్య సమావేశం కాకినాడ ఎన్జీవో హోంలో జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యక్రమంలో జిల్లాలో పదోన్నతి పొందిన ఫార్మసీ సూపర్‌వైజర్, ఫార్మసిస్టు గ్రేడ్–1 పదోన్నతి పొందిన 28 మందిని సత్కరించారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఎన్జీవో సంఘం పూర్వ అధ్యక్షుడు, విశ్రాంత ఫార్మసిస్టు బూరిగ ఆశీర్వాదం, జిల్లా ఎన్జీవో అధ్యక్షుడు గుద్దటి రామమోహన్‌రావు, జిల్లా కార్యదర్శి పి వెంకటకృష్ణ పదోన్నతి పొందిన ఫార్మసిస్టులను సత్కరించారు. కాంట్రాక్టు ఫార్మసిస్టుల రెగ్యులరైజేషన్ కోసం కృషి చేస్తామని ఎన్జీవో నాయకులు ప్రకటించారు.

సొంతింటి కలను నెరవేర్చిన సీఎం జగన్

పిఠాపురం: నిలువ నీడ లేని పేద వారికి సెంటు భూమి కొనడం అంటే పెద్ద ఆర్థిమ భారం మోయడమే.. అటువంటిది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి సెంటు భూమి ఉచితంగా ఇచ్చిఇ సొంతింటి కలను నెరవేర్చారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. ఆదివారం పిఠాపురం 21వ వార్డు జగ్గయ్య చెరువు కాలనీలో ఎమ్మెల్యే పెండెం దొరబాబు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులో పర్యటించిన ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాల వల్ల పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం కాలనీ వాసుల సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలంపై చంద్రబాబు అత్యంత నీచంగా మాట్లాడారన్నారు. ఆయన హయాంలో పేదలకు ఒక్క అరసెంటు కూడా భూమి ఇవ్వలేదు గాని ఇప్పుడు లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తే సంతోషించాల్సింది పోయి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. నిరుపేదల ఆశల హరివిల్లులైన ఇళ్ల స్థలాలను శ్మశాన వాటికలుగా పోల్చిన టీడీపీ అధినేత చంద్రబాబు పేదలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలం సెంటు భూమి కేవలం శవాలను కప్పెట్టడానికే సరిపోతుందంటు చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు.